క్లుప్తంగా

డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్సీ దండె విఠల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: డే కేర్ సెంటర్‌ను కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సీనియర్ సిటిజన్స్ సంఘం నాయకులు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో మొదటి మున్సిపాలిటీ కాగజ్‌నగర్ పట్టణంలో డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కలికోట రమణయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్ రావు, లక్ష్మినారాయణ, నర్సయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఏరియా సెక్యూరిటీ అధికారిని తొలగించాలి'

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిగా పని చేస్తున్న అధికారిని ఉద్యోగం నుంచి తొలగించి అతని ఆస్తులపై ఏసీబీ విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ సోమవారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే యాజమాన్యం సెక్యూరిటీ అధికారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. విలువైన సంస్థ ఆస్తులు దొంగతనం జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల కోసం డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని కొంతమంది కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్‌కు అలవాటు పడుతూ కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. అనేక అవినీతి, అక్రమాలు, భూదందాల ఆరోపణలపై సాక్ష్యాధారాలతో సింగరేణి సీఅండ్‌ఎండీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

లింగాపూర్: జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో బక్రీద్ పండుగ సందర్భంగా పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల సమీప ప్రాంతాల్లో పకడ్బందీగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిత్యం తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

బుద్ధ విగ్రహం తొలగింపుపై స్పందించాలి

వాంకిడి: నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం రాళ్లబోరిగాం గ్రామంలో ఈనెల 12న బుద్ధ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భగవాన్ గౌతమ బుద్ధుని విగ్రహం తొలగింపుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క వెంటనే స్పందించాలని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాళ్లబోరిగాంలో అల్లర్లు చెలరేగడానికి అక్కడి ఆర్డీవో కారణమని దళిత సంఘాల విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. దళితులపై అగ్రవర్ణాల వారు దాడి చేస్తున్న సందర్భంగా ఆర్డీవో వారికి నచ్చజెప్పకుండా అల్లర్లకు సహకరించారని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించకపోవడం విచారకరమన్నారు. రాళ్ల బోరిగాంలో దళితులు చేపడుతున్న రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. వెంటనే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని అదే స్థలంలో బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ, సిద్ధార్థ యువజన సంఘం, సమతాసైనిక్ దళ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికల ద్వారానే అభివృద్ధి సాధ్యం

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో జమిలీ ఎన్నికల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమలుపై ఉద్యోగులు, మేధావులు, వ్యాపారస్తులు, ప్రజలు, సీనియర్ న్యాయవాదులు, వైద్యులు, విద్యార్థులచే ఎన్నికల అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలంతో కలిసి మాట్లాడారు. బీజేపీ నాయకులు అరిగెల మల్లిఖార్జున్, కొట్నాక విజయ్, సొల్లు లక్ష్మి, దీపక్‌రావు, ప్రసాద్‌గౌడ్, పెంటయ్య, పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలో ఇద్దరు డిబార్

రెబ్బెన: మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షల్లో సోమవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడి ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఇద్దరు బీకాం మొదటి సంవత్సరం విద్యార్థులు కాపీ కొడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడటంతో వారిని డిబార్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీర్ ఉస్మానీ తెలిపారు.

ప్రయాణ ప్రాంగణాలు నిర్మించరూ..?

- జిల్లాలో ప్రయాణికులకు నీడ కరువు
- బస్ షెల్టర్ నిర్మాణాలకు ఆసక్తి చూపని ఆర్టీసీ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బాలాజీఅనుకోడ గ్రామంలో విగ్రహం నీడలో వేచిచూస్తున్న ప్రయాణికులు

చింతలమానెపల్లి: జిల్లాలోని అనేక మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కోసం ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై వేచిచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈక్రమంలో మహిళలు, వృద్ధులు, విద్యార్థినుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో కాగజ్‌నగర్, కౌటాలలో ప్రయాణ ప్రాంగణాలు ఉన్నాయి. పెంచికల్‌పేట మండలకేంద్రంలో గ్రామస్తుల చొరవతో తాత్కాలికంగా ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు చేయగా సిర్పూర్(టి)లో గత ఆరు నెలల క్రితం స్థలాన్ని కేటాయించినా ప్రయాణ ప్రాంగణం నిర్మాణానికి నోచుకోలేదు.

రవాణా మార్గాలు..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డిపో ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నారు. ఆయా మండల కేంద్రాల నుంచి మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు, రాష్ట్రంలోని మంచిర్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తోంది.

ప్రయాణికుల ఇబ్బందులు..

జిల్లాలో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రధానంగా రోడ్డు మార్గంపై ఆధారపడుతున్నారు. ఆయా మండలాల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణిస్తున్నారు. కాగా జిల్లాలో మూడు ప్రాంతాల్లో మాత్రమే ప్రయాణ ప్రాంగణాలు ఉండగా మిగతా ప్రాంతాలలో ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడానికి రహదారులపై, హోటళ్లలో, దుకాణాల వద్ద, చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈక్రమంలో ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో పాటు వేచి ఉండడానికి నీడ లేని పరిస్థితుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణ ప్రాంగణాలు లేక రహదారుపై వేచి ఉండడం మైనర్ విద్యార్థినులకు ఇబ్బందిగా మారింది. విద్యార్థినులు పలు సందర్భాలలో ఆకతాయిల ఆగడాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. రహదారులపై వేచి ఉండడం, ప్రైవేటు వాహనాలలో ప్రయాణించాల్సి రావడం మహిళా ఉద్యోగులకూ ఇబ్బంది కలిగిస్తోంది.

చోటు చేసుకుంటున్న ప్రమాదాలు..

ఆయా మండల కేంద్రాలలో ప్రయాణికులు ప్రధాన రహదారులపై వేచి చూస్తున్న సందర్భంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రయాణ ప్రాంగణాలు లేకపోవడంతో బస్సులను రహదారులపై నిలుపుతుండగా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బస్సులను రహదారులపై నిలుపుతున్న కారణంగా ట్రాఫిక్‌జాం సమస్య సైతం తలెత్తుతోంది.

ఆదాయానికి గండి..

ప్రయాణ ప్రాంగణాలు లేకపోవడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రయాణ ప్రాంగణాలు లేని పరిస్థితుల్లో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండడానికి ప్రయాణికులు ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు బస్సుల రాకపోకల వేళలు తెలుసుకునే అవకాశం లేక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం సురక్షితం కాకున్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలు, జీపులు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ప్రయాణ ప్రాంగణాల ఏర్పాటుకు డిమాండ్..

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం అనే నినాదాలు ప్రచారం చేస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలుకు మాత్రం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఉన్న మండలాలకు అదనంగా జిల్లాలో కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేశారు. ఆయా మండలాలకు అదనంగా బస్సులను నడుపుతున్నారు. ప్రతి మండలకేంద్రంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణ ప్రాంగణాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది. మండల కేంద్రాలతో పాటు కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్, నలుగుపల్లి క్రాస్‌రోడ్, ఈస్‌గాం, సరిహద్దు గ్రామాలు గూడెం, వెంకట్రావుపేట మరికొన్ని ప్రాంతాలలో ప్రయాణికుల రద్దీ ఉంది. మండలాలలోని గ్రామాలలో గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లతో అనుసంధానం చేసుకుని ఆయా ప్రాంతాలలో అవసరాలను పరిగణలోకి తీసుకుని బస్‌షెల్టర్లను నిర్మించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణ ప్రాంగణాల నిర్మాణాలను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగడంతో పాటు ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా సర్వేలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు తొలగించారు



మురుగుకాల్వల్లో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

వాంకిడి: మండలంలోని కనర్గాం గ్రామంలో లోపించిన పారిశుధ్యంపై 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన 'పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం' కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను తొలగించారు. అదే విధంగా తాగునీటి బోరింగ్ వద్ద ఇంకుడుగుంతలోని మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక చొరవ చూపిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కేబీ ఉట్నూర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 2 నుంచి మగ్గం వర్క్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. జూన్ 1 లోపు 18 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో వసతి, భోజనం ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9949412159, 8985633226 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వనమహోత్సవానికి సిద్ధం



మామిడిపల్లి నర్సరీని సందర్శిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

- 14 నర్సరీల్లో పెంపకం
- అందుబాటులో వివిధ రకాల మొక్కలు
- మండలంలో 1,69,400 మొక్కల పెంపకమే లక్ష్యం

లింగాపూర్: పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పంచాయతీల నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టింది. మండలంలో 14 పంచాయతీ నర్సరీల్లో 1,69,400 మొక్కల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉపాధి పథకం, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో దాదాపు 12 వేల నుంచి 14 వేల మొక్కలు నాటి సిద్ధంగా ఉంచారు. ఎంపీడీవో రామచందర్, ఏపీవో చంద్రయ్యలు ఆయా నర్సరీలను సందర్శిస్తున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు అందజేస్తున్నారు. వర్షాలు కురవగానే జూన్ 15 నుంచి మొక్కలు పంపిణీ చేసేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు వరకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

వివిధ రకాల మొక్కలు..

పంచాయతీ నర్సరీల్లో జామపండు, ఉసిరి, ఆల్లనేరేడు, చింతపండు, మామిడి, సీతాఫలం, దానిమ్మ, కర్జూర, బాదాం, గులాబీ, మల్లెపూలు, మందారం తదితర మొక్కలు పెంచుతున్నారు. గతంతో పోల్చితే ప్రజలు ఇష్టపడేలా వివిధ రకాల మొక్కల పెంచేలా చర్యలు తీసుకున్నారు.

ముమ్మరంగా పనులు

నర్సరీల్లో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల పాలిథిన్ కవర్లలో మట్టి నింపి మొక్కలు నాటారు. ఎండల నేపథ్యంలో మొక్కలకు నీరందించేందుకు పంచాయతీ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. నీటి సరఫరా చేయడం, కలుపు తీయడంతోపాటు తదితర పనులు చేపడుతున్నారు.

మొక్కలు సిద్ధంగా ఉన్నాయి



నర్సరీల్లో మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. జూన్ 15 నుంచి ప్రజలకు అవసరమైన మొక్కలను అందిస్తాం. మిగిలినవి రోడ్డు పక్కన, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షిస్తాం.

– చంద్రయ్య, ఏపీవో, లింగాపూర్

సాగుకు సమాయత్తం



విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్న పంట చేను

- పనుల్లో రైతుల బిజీబిజీ
- మృగశిర కార్తె తర్వాత వర్షాలు!
- పంటల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన

తిర్యాణి: వానాకాలం పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే రోహిణి కార్తె ప్రారంభంకాగా, దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులను పొలాల్లో చల్లడం వంటి పనులు ఊపందుకున్నాయి. మండలంలో వర్ష ఆధారిత పంటల సాగు ఎక్కువగా జరుగుతుండగా, రైతులు ఏ ఏయే పంటలు సాగు చేస్తారు? ఎంతమేర విత్తనాలు, ఎరువులు అవసరమవుతాయి. తదితర అంశాలతో ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సాగు ప్రణాళికలు సిద్ధం చేశారు.

24,947 ఎకరాలల్లో సాగు అంచనా

ఈ సంవత్సరం వానాకాలం పంటల సాగుకు సంబంధించి 24,947 ఎకరాలల్లో సాగు కావచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతిఏడాది లాగా ఈసారి రైతులు పంటల సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చేనెల 8న మృగశిర కార్తె తర్వాత వర్షాలు కురుస్తాయని మండల రైతులు వేసవి దుక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉంచుతున్నారు. ఇప్పటికే వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురవడంతో విత్తనాల, ఎరువుల కొనుగోలు కోసం ఫర్టిలైజర్ షాపుల్లో క్యూ కడుతున్నారు. విత్తనాల ఎంపిక, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారు.

ఈ ఏడాది పంటల సాగు అంచనా

పంటలు	ఎకరాలు
పత్తి	21,523
వరి	1,181
కందులు	1,807
చిరుధాన్యాలు	500

అవగాహన కల్పిస్తున్నాం



వానాకాలం పంటల సాగు సంబంధించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వాయుగుండ తీవ్రతతో కురిసే వర్షాలకు విత్తనాలు విత్తుకుంటే మొలకత్తే శాతం తక్కువ ఉంటుంది. పూర్తి స్థాయిలో రుతుపవనాలు వచ్చాకే విత్తుకోవాలి. మండలంలోని ఐదు రైతు వేదికలో ఏఈవోలు అందుబాటులో ఉండి రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

– వినయ్, ఏవో

మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్లు జరిగేలా చర్యలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మైనార్టీ గురుకులాల్లో వందశాతం అడ్మిషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ దిపక్ తివారీ, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్, మైనార్టీ జిల్లా సంక్షేమాధికారి నదీమ్‌తో కలిసి సోమవారం అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నాలుగు మైనార్టీ గురుకుల వందశాతం అడ్మిషన్లు జరిగే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, నూతన డైట్ మెనూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో చేర్పించాలన్నారు. గురుకుల ప్రిన్సిపాల్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు ముందస్తు చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న వర్షాకాలంలో ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సోమవారం తహసీల్దార్లు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు, ఎంపీడీవోలతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై మొదటి సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని లోతట్టు గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వరదలతో రహదారులు దెబ్బతినకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, గత అనుభవాల దృష్ట్యా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని పది ప్రమాద ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ లైవ్ జాకెట్స్, చిన్న పడవలు, తాళ్లు, కటింగ్ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. మహారాష్ట్ర సమీప ప్రాంతాలైన కెరమెరి మండలంలోని గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలన్నారు. 151 కటాఫ్ గ్రామాలు, హ్యాబిటేషన్లలో ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఈ నెల 30లోగా నివేదిక అందించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు అంశంపై డీఆర్‌డీఏ, జిల్లా సహకార శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిర్దేశించిన ప్రకారం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కేంద్రాల్లో రైతులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, సమన్వయంతో లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా మండలాలు, మున్సిపాలిటీల వారీగా అర్హుల జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంబంధిత అధికారుల తదితరులు పాల్గొన్నారు.

సీసీ సైడ్ డ్రెయిన్ నిర్మించాలని వినతి



మాట్లాడుతున్న కాలనీవాసులు

వాంకిడి: అసంపూర్తిగా వదిలేసిన సీసీ సైడ్ డ్రెయిన్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్–363 నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన సైడ్ డ్రెయిన్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కౌటాలలో వర్షం

కౌటాల: మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పారిశుద్ధ్య పనులు



చేతిపంపు వద్ద శుభ్రం చేస్తున్న కార్మికుడు

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఆయా చోట్ల రోడ్లను శుభ్రపర్చారు. మురుగుకాల్వల్లో చెత్తను, చేతిపంపులు వద్ద నిలిచి ఉన్న నీటిని తొలగించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న సైన్స్ అధికారి మధుకర్

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అన్నారు. సోమవారం మండలంలో చిర్రకుంట పాఠశాలలో పాఠశాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో ఐదేళ్లు నిండిన పిల్లలను తప్పకుండా ప్రభుత్వం పాఠశాలలో చేర్పించాలన్నారు. హెచ్‌ఎం జలపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)లు కొనసాగాయి. పోషకులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో హెచ్‌ఎంలు.. బడుల బాగుకోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ప్రభుత్వ బడుల్లో ఏఐ(కృత్రిమ బోధన) పాఠాలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

'ప్రాణహిత' నిర్మిస్తాం

కౌటాల: ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్ అన్నారు. సోమవారం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని ఆయన ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి పరిశీలించారు.